## యువ ఆపద మిత్ర'కు
# యువతకు అవకాశం

- 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలి
- మేరా యువ భారత్ ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి మూల రంజిత్ రెడ్డి పిలుపు



**సిద్దిపేట, ఆగస్టు 30 (వుదయం):**

ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి ప్రాణాలను కాపాడేందుకు యువత ముందుకు రావాలని మేరా యువ భారత్ ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి మూల రంజిత్ రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు చేస్తున్న 'యువ ఆపద మిత్ర' సేవా పథకం ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలోని అర్హులైన యువతీ యువకులకు ఉచిత విపత్తు స్పందన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ యువకులు, కూలీలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, సేవా భావం కలిగిన వారు ఈ కార్యక్రమం లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆగస్టు 31లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9650889829, 9963056730 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత విపత్తు నిర్వహణ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన ప్రతి వాలంటీర్‌కు సుమారు రూ.10 వేల విలువైన రక్షణ సామగ్రి కిట్ అందజేయడంతో పాటు, ఎంపికైన అభ్యర్థులకు రూ.5 లక్షల విలువైన ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం ద్వారా అధికారిక ధ్రువీకరణ పత్రం అందజేస్తారని తెలిపారు. విపత్తులు, ప్రమాదాల సమయంలో సమర్థవంతంగా స్పందించేలా యువతకు శిక్షణ ఇవ్వడం ద్వారా సమాజానికి సేవ చేసే అవకాశం లభిస్తుందని, అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రంజిత్ రెడ్డి కోరారు.

# రాష్ట్రంలో ఎగిరేది కాషాయ జెండానే

- కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే - కిషన్ రెడ్డి ఫైర్
- మోదీ రాజీనామా ఎందుకు చేయాలి?.
- . త్రిబుల్ తలాక్ రద్దు చేసినందుకా?: తాండూరు సభలో కేంద్ర మంత్రి సూటి ప్రశ్న
- వికారాబాద్ బీజేపీ సారథిగా రమేష్ కుమార్: ఘనంగా బాధ్యతల స్వీకారం!



**తాండూర్ ఆగస్టు 30 వుదయం ప్రతినిధి**

వికారాబాద్ జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా యు. రమేష్ కుమార్ ఆదివారం సమీపంలోని వీరసేవ సమాజం కళ్యాణ మండపంలో బాధ్యతలు స్వీకరించారు. తాండూరులో ఘనంగా నిర్వహించిన ఈ బాధ్యతల స్వీకరణ మహోత్సవానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, రమేష్ కుమార్‌కు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కార్యకర్తల సమక్షంలో పార్టీకి సరికొత్త ఉత్సాహం, జోష్ కనిపిచాయి.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే: కిషన్ రెడ్డి ఫైర్**

సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ.. రాబోయే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీలు రెండూ ఒకటేనని, ప్రజలను మోసం చేయడంలో 'దొందూ దొందే' అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంపై కిషన్ రెడ్డి నిలదీశారు."ముస్లిం మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతూ త్రిబుల్ తలాక్ రద్దు చేసినందుకా మోదీ రాజీనామా చేయాలి?" "దేశంలో ఎలాంటి అసాంఘిక, ఉగ్రవాద కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టినందుకా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. దేశాన్ని సురక్షితంగా, అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరచాలని, వికారాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, మారుతి కిరణ్, పార్టీ జిల్లా, నియోజకవర్గ స్థాయి బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నాగారం మల్లేశం కౌన్సిలర్లు , శ్రీకాంత్ రెడ్డి కిరణ్ ముఖ్య నాయకులు లలిత, సాహూ శ్రీలత, భద్రేశ్వర్, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి అఖిల రాజ్ పౌండేషన్ బియ్యం అందజేత



**దుబ్బాక, ఆగస్టు 30 (వుదయం) :**

దుబ్బాక మండల పరిధిలోని పెద్ద చీకోడు గ్రామానికి చెందిన పున్న అంజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో అఖిల రాజ్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కూకట్‌పల్లి ఎస్ఐ తౌడా సత్యనారాయణ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తామని తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడమే ఫౌండేషన్ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో అఖిల రాజ్ ఫౌండేషన్ ప్రతినిధులు ఇనుప రవి ,కంకణాల చంద్రం,ఎల్లం, షరీఫ్,నరేష్, తదితరులు పాల్గొన్నారు.



## బద్లావ్ జరూరీ హై, మార్పు కావాలి అంటూ చలో ఢిల్లీకి తరలిన నేతలు:

**సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):**

దేశంలో అమలవుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ, ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణ కోసం సీపీఐ ఇచ్చిన "బద్లావ్ జరూరీ హై, మార్పు కావాలి" పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా నుండి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ తెలిపారు.
హైదరాబాద్‌లోని నాంపల్లి స్టేషన్ నుండి తెలంగాణ ఎక్స్‌ప్రెస్ మరియు ఇతర మార్గాల ద్వారా పార్టీ శ్రేణులు ఢిల్లీకి బయలుదేరారన్నారు. 2014 తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న విధానాలతో దేశ ఆర్థిక స్థితి అర్ధ శతాబ్దం వెనక్కి వెళ్లిందని విమర్శించారు. కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలు తప్ప మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిందేమీ లేదన్నారు.ఢిల్లీ సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాతో పాటు జాతీయ కార్యదర్శివర్గ సభ్యులందరూ పాల్గొని దేశ పరిస్థితులను వివరిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు బండి లక్ష్మీపతి, బిజ్జా శ్రీనివాసులు, తుమ్మల శివుడు, వి.రవీందర్, ఈ.మల్లయ్య, టి.కిరణ్ కుమార్, డి.అంజనేయులు, జె.రమేష్, కె.వెంకటమ్మ, ప్రేమ్ కుమార్ తదితరులు ఢిల్లీకి బయలుదేరారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**బిఆర్ఎస్ నేత నాగం శశిధర్ రెడ్డి**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 30 (వుదయం బ్యూరో):**



ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం శశిధర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం నాడు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలు గడిచినాఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. హామీల అమలు కోసం ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు మరోసారి రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు తక్షణం చెల్లిస్తామని, మొదటి తారీఖున జీతాలు ఇస్తామని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని, జీవో 317 సమీక్షిస్తామని, కొత్త పీఆర్సీ ప్రకటించి 6 నెలల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు.అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, ఐకేపీ, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీ కూడా గాలికి వదిలేశారని ఆరోపించారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌తో హెల్త్ కార్డు, అర్బన్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ కింద 150 రోజుల పని, రూ.350 కనీస వేతనం హామీలను కూడా ప్రభుత్వం మరిచిపోయిందని అన్నారు.రైతులకు ఉచిత విద్యుత్ హామీ ఏమైంది?
రైతులకు నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం కరెంట్ కోతలతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని శశిధర్ రెడ్డి ఆరోపించారు. గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తుండటంతో వరి నాట్లు, వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు
కాలువల్లో జమ్ము.. పట్టించుకోని అధికారులుకల్వకుర్తి ప్రాజెక్టు పరిధిలోని కాలువలు జమ్ము, పూడిక, గుర్రపు డెక్కతో పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయని తెలిపారు. సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నా నీటిపారుదల అధికారులు కాలువల నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాలువలను పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణమే జమ్మును తొలగించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేసి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.ఇచ్చిన గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, అవసరమైతే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు అర్థం రవి, బాలగౌడ్, లక్ష్మయ్య, కురుమయ్య, సత్యం, భీముడు, అహ్మద్ పాషా, కౌన్సిలర్ అర్జునయ్య, మూలింటి వెంకటేష్, సుబ్బయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.11.50 లక్షలు మంజూరు

**నాగర్‌కర్నూల్ రూరల్, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):**

సమగ్ర శిక్షా అభియాన్ పథకం ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.11.50 లక్షల నిధులు మంజూరయ్యాయి.
ఒక్కో కళాశాలకు సుమారు రూ.1.04 లక్షల చొప్పున నిధులు అందనున్నాయి.
ఈ నిధులను కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, విద్యా సంబంధిత అవసరాల కోసం వినియోగించనున్నారు.నిధుల మంజూరుతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతులు మెరుగుపడి విద్యార్థులకు మరింత సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కలగనుందని అధికారులు తెలిపారు.



## పైడిగుమ్మల్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవం



**కోహీర్ ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి )**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో ప్రభుత్వ ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. మండల పరిధిలోని పైడిగుమ్మల్ మరియు పైడిగుమ్మల్ తండా గ్రామాల్లో నూతనంగా న గృహప్రవేశం. మహోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డా.ఎ. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పైడిగుమ్మల్ గ్రామ లబ్ధిదారులు సొంతిల్లు లభించినందుకు.హర్షం వ్యక్తం చేశారు.నూతన గృహాల్లో అడుగుపెట్టిన కుటుంబాలకు నాయకులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలియజేశారు.గృహిణి సుందరంగా అలంకరించి, సాంప్రదాయ బద్ధంగా గృహప్రవేశ వేడుకను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షులు అస్మా.కోహీర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. టీ సువర్ణ మల్లన్న పాటిల్. పైడిగుమ్మల్. మాజీ ఎంపీటీసీ. బి. జ్ఞానారత్నం. గ్రామ ఉప సర్పంచ్. కప్పోడా. ఆశమ్మ. వార్డ్ మెంబెర్. బందెల.ప్రశాంత్ గ్రామ సీనియర్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.గ్రామానికి చెందిన మహిళలు, యజమానులు సాంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొన్నారుప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక, నిర్మాణాత్మక సహకారంతో పక్కా గృహాల నిర్మాణం వేగవంతమైంది.గ్రామస్తుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసిన లబ్ధిదారులు ఆనంద భాష్పాలతో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, స్థానిక యంత్రాంగం సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.పైడిగుమ్మల్ తండాలో జరిగిన ఈ వేడుక పరిసర ప్రాంతాల్లో ఎంతో ఆసక్తిని, సంతోషాన్ని నింపింది., లబ్ధిదారులందరికీ అభినందనలు తెలుపుతూ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా గృహప్రవేశం కార్యక్రమాలు జరిపారు.

## శ్రావణ మాసం మూడో ఆదివారం ఓజల మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు

- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న భక్తులు



**దుబ్బాక, ఆగస్టు 30 (వుదయం):**

శ్రావణ మాసం మూడో ఆదివారం సందర్భంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామ శివారులో వెలసిన శ్రీ ఓజల మల్లన్న స్వామివారిని భక్తులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.
శ్రీ ఓజల మల్లన్న స్వామివారిని దర్శించుకునేందుకు పెద్దగుండవెల్లి గ్రామస్తులతో పాటు తిమ్మాపూర్, పద్మనాభునిపల్లి, అప్పనపల్లి గ్రామాల నుంచే కాకుండా చుట్టుపక్కల ఇతర గ్రామాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.



## సెప్టెంబర్ 3న 'హలో మాదిగ–చలో సిద్ధిపేట'

- అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు మహా బైక్ ర్యాలీ
- ప్రతి దళిత కుటుంబం నుంచి ఒక బైక్‌తో తరలిరావాలి
- దేవులపల్లి రాజేందర్ మాదిగ పిలుపు

**నంగునూరు, ఆగస్టు 30 (వుదయం):**

ఎస్సీల సంక్షేమం, హక్కులు, సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 3న సిద్ధిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'హలో మాదిగ-చలో సిద్ధిపేట' మహా బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, సిద్ధిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి దేవులపల్లి రాజేందర్ మాదిగ పిలుపునిచ్చారు.ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షుడు కేదాసు మోహన్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 3న సిద్ధిపేటలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**ఎస్సీ నిధులు ఎస్సీలకే కేటాయించాలి**

ఎస్సీ కార్పొరేషన్ నిధులను ఎస్సీల సంక్షేమం, అభివృద్ధి కోసమే వినియోగించాలని రాజేందర్ డిమాండ్ చేశారు. ఎస్సీల కోసం ప్రకటించిన సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన అభయహస్తం పథకం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**సఫాయి కార్మికులకు రూ.25 వేల వేతనం ఇవ్వాలి**

గ్రామాల పరిశుభ్రతలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాజేందర్ కోరారు. డ్రైనేజీల్లోకి దిగి మురుగు కాలువలను శుభ్రం చేస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న సఫాయి కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ.25 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత, గౌరవప్రదమైన వేతనం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.

**హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం**

తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని రాజేందర్ పిలుపునిచ్చారు. సిద్ధిపేట జిల్లా పరిధిలోని ప్రతి దళిత కుటుంబం నుంచి కనీసం ఒక బైక్‌తో సెప్టెంబర్ 3న సిద్ధిపేటకు తరలివచ్చి మహా బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. అంబేద్కర్ ఆశయాల సాధన, ఎస్సీల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా తమ డిమాండ్లను ప్రభుత్వానికి బలంగా వినిపించాలని అన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాల నరసింహులు, కొంకటి బాబు, మండల అధికార ప్రతినిధి దేవులపల్లి కృష్ణ, డి. శ్రీకాంత్, డి. అజిత్, డి. శేఖర్, డి. బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రుల రోడ్ల కోసమేనా ఎంపీ ప్రారంభోత్సవాలు

- పట్టణంలోని రోడ్ల పరిస్థితి..
- ప్రభుత్వాసుపత్రి రోడ్డు పరిస్థితి....?



**నారాయణపేట ఆగస్టు30 (వుదయం ప్రతినిధి)**

జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి కోసం ఆగ మేఘాల మీద సిసి రోడ్డును వేసి ఆదివారం ఎంపీడీకే అరుణ చేత బిజెపి నాయకులు ప్రారంభించారు. బిజెపి నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి కోసం ఉద్యమాలు ,నారాయణపేట బంద్ ,నిరాహార దీక్షలు చేశారు. కానీ పట్టణంలోని రోడ్ల పరిస్థితి గురించి వాళ్లకు పట్టవా.... ఆసుపత్రి ముందు సైతం అధ్వానంగా ఉన్న రోడ్డు కనిపించలేదా... వీటికి మంజూరీ కానీ నిధులు ప్రైవేట్ ఆసుపత్రి కోసం రోడ్డు వేసేందుకు నిధులు ఏ విధంగా మంజూరి అయ్యాయని కొందరు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం 8వ వార్డులో వేసిన సిసి రోడ్డు చుట్టుపక్కల ఎలాంటి గృహాలు లేకున్నా కేవలం ప్రైవేట్ ఆసుపత్రి కోసమే వేశారని కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ రోడ్డు చుట్టుపక్కల చూస్తే ఎలాంటి ఇల్లు కనిపించకపోయినా కేవలం ఆసుపత్రి మాత్రమే కనిపిస్తున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. అప్పంపల్లి దగ్గర ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ముందు సైతం సిసి రోడ్డు మంజూరు చేయకుండా జిల్లా కేంద్రంలోని కేవలం ప్రైవేట్ ఆసుపత్రి కోసం సి సి రోడ్డు ఎంపీ డీకే అరుణ ఏ విధంగా ప్రారంభిస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ గ్రామీణ ప్రాంతాలలో సైతం రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని వాటిపైన కూడా దృష్టి పెట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**సి సి రోడ్డును ప్రారంబించిన ఎంపీ అరుణ...**

నారాయణపేట మున్సిపాలిటీ లోని 8వ వార్డు సత్య సాయి కాలనీ లో ఆదివారం సీసీ రోడ్లను పాలమూరు ఎంపీ డీకే అరుణ ప్రారంబించారు.ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి ,జిల్లా బీజేపీ అధ్యక్షులు సత్య యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామ య్య,మున్సిపల్ వైస్ చైర్మన్ మంజుల జీ ఆర్ రెడ్డి, కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బి.కృష్ణ, గోపాల్ యాదవ్, సీనియర్ నాయకులు ఉదయ భాను, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రీయ వ్యవసాయం, మహిళా సాధికారతే లక్ష్యం:
# జినుగుర్తిలో వైభవంగా ఏకలవ్య ఫౌండేషన్ కార్యక్రమాలు..

**తాండూరు / వికారాబాద్:**

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జినుగుర్తి గ్రామంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో ఆదర్శనీయమని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కొనియాడారు. ఫౌండేషన్ ద్వారా రైతులకు ఉచితంగా నిర్వహిస్తున్న సేంద్రీయ వ్యవసాయ శిక్షణను, మహిళలకు స్వయం ఉపాధి కల్పించే శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... రసాయన ఎరువులు, పురుగుల మందులు అధికంగా వాడటం వల్ల నేల తత్వంతో పాటు పంట నాణ్యత తగ్గి, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి, సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సేంద్రీయ సాగుపై అవగాహన కల్పిస్తూ, ఉపాధి శిక్షణ ఇస్తున్న ఏకైక సంస్థ ఏకలవ్య ఫౌండేషన్ అని ప్రశంసించారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పి. మహేందర్ రెడ్డి, తాండూరు శాసన సభ్యులు బియ్యాన్ని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఇలాంటి ఉపాధి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.
ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరిస్తూ, హాజరైన ప్రజాప్రతినిధులకు, సహకరిస్తున్న గ్రామస్తులకు ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆగయ్య ప్రత్యేక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు, రైతులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.






## నిత్యవసర ధరల మంటల్లో కాగిపోతున్న సామాన్యుడు:

**సీపీఎం**

**అచ్చంపేట, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):**




దేశంలో, రాష్ట్రంలో నిత్యవసర ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యుడు అల్లాడిపోతున్నాడని సీపీఎం అచ్చంపేట మండల కార్యదర్శి వర్గం సైదులు ఆవేదన వ్యక్తం చేశారు.పప్పులు, నూనెలు, కూరగాయలు, చక్కెర తదితర నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరంగా మారుస్తున్నాయని, దీంతో ప్రతి కుటుంబంపై అదనపు ఆర్థిక భారం పడుతోందని అన్నారు.ప్రజలకు అచ్చే దిన్ తెస్తామని చెప్పి బీజేపీ ప్రభుత్వం ధరల భారంతో సామాన్యుడి నడ్డి విరుస్తోందని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా ధరల నియంత్రణలో విఫలమైన బీజేపీ విధానాలను సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు.నిత్యవసర ధరలను తక్షణమే అదుపులోకి తీసుకురావాలని, సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై సీపీఎం అచ్చంపేట మండల కమిటీ నిరంతరం పోరాడుతుందని, సామాన్యుడి గొంతుకగా నిలుస్తుందని తెలిపారు.

